# బ్రతకనివ్వండి

శ్రీ ఆదివిష్ణు

ఎవరి గురించో యెందుకు ? నా గురించి నేనే వ్రాసుకుంటాను. ఎవడి గురించి వాడే రాసుకోడంలో గల యిబ్బంది మరొాడి గురించి వ్రాయడంలో ఉండదు. ఎదటివాడి గొప్పతవాన్ని ఎత్తి చూపుతే కాబోసనుకోవచ్చు. తన గొప్పతనం గురించి ఏ కొంచెం రాసుకున్నా అతిశయోక్తి అనేస్తారు. కనక తన గురించి తనే రాసుకోడం ప్రారంభిస్తే తగిన జాగ్రత్త తీసుకోడం చాలా అవసరం. ఈ అవసరాన్ని తూ. చ. తప్పకుండా పాటించేను.

కథావస్తువు సర్వ సాధారణమైనది. ఈ వస్తువు గురించి 'మంచి కథలూ' 'మంచి' గా రాయలేని కథలూ ఇంతకుమునుపే వచ్చివుండొచ్చు. ఈ కథాంతం నన్నాకర్షించక పోతే ఈ కథ రాసిఉండేవాడిని కాదు. పైగా ఇది నా కథ !

ఆఫీసనబడే నాలుగ్గోడల మధ్య కొందరదృష్టవంతులూ, మరికొందరు దురదృష్టవంతులూ వాళ్లవాళ్ల తల లొంచుకుని పనిచేయడ మనేది కొత్త విషయం కాదు. కాబట్టి ఆఫీసు వాతావరణాన్ని రెండు రకాలుగా భాగించవచ్చు. మొదటి కొందరికి స్వర్గంగానూ, రెండో కొందరికి నరకంగాను మారుతుంటుంది. రెండోదాని గురించి లోగడెప్పుడో వ్రాసియుండటం చాత ఈ కథ నిప్పుడు తప్పనిసరిగా మొదటి రకానికి అంకితం చేస్తున్నాను. మీదు మిక్కిలి ఈ వస్తువూ దానికి సంబంధించిందేను.

కాలేజీ వదిలి (దాని గురించీ కొన్ని కథలు రాయడం జరిగింది) నాలుగేళ్లు పూర్తయ్యాయి. అప్పట్లో నాకో సరదా ఉండేది. క్లాసు జరుగుతున్నప్పుడు వెనక బెంచీలో కూర్చుని 'పారిస్' గురించి కలలుకనే కుర్రాళ్లలో నే నొకడ్ని. ఇతర దేశాల్లో కాలం గడిపే జాతకుల అదృష్టాన్ని అభినందించే వాళ్లల్లో నేను మొదటివాడిని. బందరనబడే కేవలం తెలుగ్గు పట్టణంలో కూర్చుని ఆయా దేశాల వాతావరణం, ఆచార వ్యవహారాల గురించి ఆలోచనలు చేస్తూ, దాని ద్వారా లభ్యమయ్యే మహత్తరానందాన్ని సంపాయించుకున్న కలల మనిషిని.

ఆ రోజుల్లో షెక్నిలర్‌లో కల లొస్తుండేవి. సరదాగా ఉన్నప్పుడు నా చుట్టూ చేరిన నా మిత్రులకి మనసు విప్పుకుని నా కలలు గురించి చెప్తూండేవాడిని. వింటూన్న కాస్సేపూ శ్రద్ధగా విని, వెళ్లిపోతూ భుజం చరిచి అనేవారు—'వొరేయ్ రావూ ! నువ్వు కథలు రాసే ప్రమాదానికి దిగజారిపోగలవు సుమా' అని.

నా కలల్నే కథలుగా రాయనీండి—లేదూ—అనుభవాలనే రాయనీండి, నా మిత్రులన్న మాటల్ని నిజంచేసి ఈ కలల మనిషి కథల మనిషిగా మారిపోయేడు. ఇప్పటికీ పై నుదహరించిన 'అవస్థ' నుంచి దూరంకాలేదు. పైగా స్థాయిని పెంచుకున్నాడు గూడాను.

నా కిష్టమైన ప్రపంచాన్ని తప్పనిసరిగా వదులుకుని రోజుకి ఇన్ని గంటలని చెప్పి ఆఫీసనబడే జైల్లో ఎలా బ్రతికేది ?—ఉద్యోగంలో కాలుపెట్టిన మరుక్షణం కలిగిన ఈ రకమైన ప్రశ్నకి అనుభవం కొంచెం లేటుగా జవాబు చెప్పింది. ఆఫీసు తలుపులు పదిన్నరకి తెరుచుకుంటాయి మళ్లా అయిదున్నరకి మూసుకుంటాయనేది అనుభవం నేర్పిన సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం ఒక్క నిమిషం ముందుగానీ మరో క్షణం వెనగ్గానీ కాలాన్ని ఖర్చు చేయలేదు.

విదేశాల్లో గడపాలనే పగటి కల దుమ్ముకొట్టుకుపోయిందేమాని తలుచుకుని కుమిలిపోయేంత చాతకాని మనిషిని కాను. దాని ఫలితంగా ఏర్పడిన 'కసి' ని నన్ను పోషిస్తున్న ఉద్యోగమ్మీద రుద్దేంత తెలివితక్కువవాడినీ కాను.

నవోత్సాహాన్నీ, రంగుల లోకాల్నీ చూపించే కథారంగం నన్ను దూరం చేసుకోదు. నేను దూరం కాలేను. ఈ స్థితిలో రోజుకున్న ఇరవైనాలుగ్గంటల్లో ఆరు గంటలు మరో వ్యాపకాన్ని నెత్తి నెట్టుకు పూజించడం పెద్ద శిక్ష ! ఒప్పుకుంటాను ! కానీ అలా అని చెప్పి వాశ్రమకి ప్రతిఫలమిస్తో, నా కృషిపట్ల నమ్మకం పెట్టుకున్న ఉద్యోగానికి అన్యాయం చేయడం నా ధర్మం కాదు.

శ్రద్ధగా రాసే కథకీ, నడుంవంచి చేసే ఉద్యోగానికీ తోటి మనిషి మెచ్చుకున్నా మెచ్చుకున్నా లోపలున్న ఆత్మారాముడు తృప్తిపడి సర్టిఫికేటిస్తే అంతకన్నా మించిన ఆనందం మరెక్కడుంటుందనేది నా అభిప్రాయం. అందుచేత, ఆఫీసుకి కేటాయించిన కాలాన్ని తూ. చ. తప్పకుండా పాటించడం జరుగుతోంది. దేవుడొచ్చేది, ఆ కాలాన్ని వృథా చేయడం నా కిష్టంలేదు.

అయిదున్నరకి సరిగ్గా బైటికొస్తాను. అడుగు బైట పెట్టంగానే కళ్లెంలేని ఆలోచనల గుర్రం నాకోసం సిద్ధంగా ఉంటుంది. రోజులో మిగిలిన కాలమంతా దానిమీదనే స్వారీ చేస్తాను. దేవుడొచ్చేది, ఆ గుర్రం మరి దిగను.

ఆఫీసులో రాజకీయాలు చోటు చేసుకోవచ్చు. ఒకళ్లంటే మరోళ్లకి వల్లమాలిన విరోధం గావచ్చు. పైవాళ్ల అభిమానంకొరకు వెకిలి వేషాలు పెట్రేగిపోవచ్చు. వీ టన్నిటికీ నేను అతీతుడిని. నా లోకం వక్క ఆఫీసే కాదు. నా కర్తవ్యం, నా క్షేమం, నా భవిష్యత్తు వగైరాలు కేవలం ఆఫీసుకే అంకితం కాదు. నేను మరికొంచెం పరాయి మనిషిని. ఎక్కువగా ఇతర రంగానికి సంబంధించినవాడిని. నాకున్న వోపిక మొత్తాన్నీ ఆఫీసుకే ధారపోస్తే నాగతేంగాను ? నా కలలేంగాను ?

ఇదీ గుమాస్తాగా, కథకుడిగా నాటూకీ పరిచయం.

ఉద్యోగంలో చేరిన కొత్త రోజులు కొంచెం దడగా గడిచేయి. నా మనసు నర్థం చేసుకుని నాకో స్థాన మివ్వగలదా యీ బృంద మని భయపడ్డాను. కానీ అదృష్టవశాత్తూ నే ననుకున్నంత నరకం కాలేదు మా ఆఫీసు. అన్నిరకాలవాళ్లూ ఉన్నా ఎవరి పరిధుల్లో వా ళ్లున్నారు గనుక నాకు రక్షణ కలిగింది.

నా సీటు గురించి గూడా కొంచెం చెప్తాను. లక్షల్లో తూగుతున్న మనిషికి వందలు సంపాయించే మరో మనిషితో తలమునిగేంత పనుంటుందని తెలిసిన మరుక్షణం నేనెంతో ఆశ్చర్యపోయేను. మనుషుల్నే కొనగల తాహతు వాళ్లది. కేవలం 'సర్వీసు' నాది. చిత్రం. అందుచేతనే అంటారు. సృష్టిలో పనికిరాని చవట వస్తువు ఒక్కటీ లేదని. కవిత్వానికీ అదే సూత్రం. ఉపయోగించగల నేర్పుండాలే గానీ అగ్గిపుల్లా, సబ్బు బిళ్లా, కుక్కపిల్లా మొదలైన వేవీ నిషేధాలు కావుట.

రోజూ వచ్చే పోయేవారితో మా ఆఫీసు రద్దీగా ఉంటుంది. వొచ్చేవాళ్లల్లో ఎక్కువభాగం నా కోసమే. మర్యాదగా మటాడినంతకాలమూ మర్యాదగానే నడిచి, శృతిమించిన మరుక్షణం తగ్గ సమాధాన మివ్వడం అలవాటు నాకు. కుర్రవాడినీ, వేడి నెత్తురు కలవాడినీ పైపెచ్చు కథలు రాస్తున్నవాడినీ గనక నరనరాన్న ఈ గుణం బాగా పనిచేస్తోంది. సంగతి తెలుసుకొని మరీ నాతో వ్యవహరించేవారు వచ్చే 'లక్షల మనుషులు.'

ఆఫీసు ఫరంగా ఆ సీటుకున్న గౌరవం నాకు దక్కింది. దానికి తోడు ఆఫీసరు మనసున్న మనిషి. నా వెనుక కొండంత అండగా నించునేవారు.

చాలా నెలలు గడిచేయి. చాలా అనుభవాలు గడించేను. చాలామంది చేత 'మంచి' అనిపించుకున్నాను. ఫైళ్లు సీట్లో పెరిగిపోవడం యిష్టంలేదు. ప్రతి కాగితం వెంటనే కదలడం సరదా. ఆఫీసులో పెరిగిన పాపం బయట నా మవమని తినేస్తే నా గుర్రపుస్వారీ ఏంగాను ?

ఈ చేతులు లక్షలు రాసి లక్షాధికారుల అవసరాలకి సాయపడ్డాయి. ఈ చేతులు వా ళ్లందరిచేతా మన్ననలు పొందేయి. అంతేగాని, ఈ చేతులకి సంకెళ్లు వేసుకోవడం తెలీదు. ఈ చేతులు మరోళ్ల చెప్పుచేతల్లో నలిగిపోడం తెలీదు. ఆ పరిస్థితి కలుగుతే వేడినెత్తురు చల్లబడి గుండె ఆగుతుంది. లక్షలిస్తున్నప్పుడు, అదే కారణంగా 'ఆశ' చెందడం సాంప్రదాయమైతే, ఆ సాంప్రదాయాన్ని అసహ్యించుకోడం నా గుణం. లక్షల్ని నా సంస్థ యిస్తున్నది. అలా యిచ్చేందుకు నాలాటి మరమనుషుల్ని ఏర్పాటుచేసుకున్నది. మరలు పనిచేస్తాయి. సంస్థ ప్రతిఫల మిస్తుంది. మరలకీ సంస్థకీ మధ్య లక్షల మనుషులతో ప్రమేయంలేదు ఆ అవకాశాన్ని మర స్వయంగాయిస్తే ఆ మర చెడిపోయిందనే చెప్పాలి. దాన్నిసంస్థ అనబడే యంత్రంనుంచి తొలగించాలనే అనాలి.

అందుచేత నేను లక్షల మనుషుల దగ్గర 'ఆశ' చూపించేవాడిని కాదు. వాళ్లు వస్తే పలుకరించేవాడిని. చాతనైతే వాళ్లక్కావల్సిన పని చేసేవాడిని. లేదూ—ఖచ్చితంగా వాయిదా వేసేవాడిని.

—తన గురించి తనే రాసుకోడంలో గల ఇబ్బందిని గమనించి, కావల్సిన జాగ్రత్త తీసుకున్న మీదట తయారైన ఉపోద్ఘాతంపై నుదహరించాను. అది మేకులతో బిగించి మరీ రాసింది.

అయిదున్నర తర్వాత నాకున్న వ్యాపకం ముందే మనవి చేశాను. దానికి సంబంధించిన మనుషులు కొందరు ఒక చిన్న సమావేశం లాటిది ఏర్పాటు చేయడం మూలంగా, వోనాడు, అక్కడికి వెళ్లడం జరిగింది. ఆ సమావేశంలో నాకు పరిచయమైన కుర్రాడి పేరు రాజా. అతనికి కథలు చదవడం చాలా యిష్టంట. కాలం కలిసివస్తే ఆతనూ మాలాగా తయా

రవ్వాలని ఉద్దేశంట. అతనిది తణుకుట. తెలిసిన మిత్రు డెవరో మా సమావేశం గురించి చెప్పగా విని వచ్చాట్ట.

సమావేశం ముగిసిన తర్వాత అతను నాతోపాటు మా రూముకి వచ్చేడు. నా కథల గురించి చాలాసేపు మాట్లా డేడు. మా హోటల్లోనే భోజనం చేశాం. 'హెలియన్స్' సినిమా గూడా చూసినట్టు జ్ఞాపకం. అతనేదో లాడ్జింగ్‌లో గది తీసుకోడం మూలంగా అత నెళ్ళిపోయేడు. ఆ రాత్రి అలా గడిచింది.

ఆ మర్నాడు అతను మా ఆఫీసుకి, నా సీటుకి వచ్చి నప్పుడు నే నెంత ఆశ్చర్యపోయేనో అత నంత కంగారుపాటు చెందేడు. అత నొచ్చిన పని టూకీగా చెప్పేడు. ఆ పని నిన్ననే చేసినట్టు చెప్పగా విని మెరిసే కళ్ళతో తన కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. రాజూ వాళ్ల నాన్నగారు పేరొందిన పెద్ద కాంట్రాక్టరు. ఆంధ్రలో ఆయనకి మంచిపే రున్నది. ఆయనకి మా సంస్థ చాలా డబ్బు యిచ్చింది. ఇస్తూనే ఉంది. అందు నిమిత్తం అవసరమైనప్పుడల్లా తండ్రి తరఫున రాజానే వస్తూంటాట్ట.

రాజాతో ఆనాటి నా పరిచయం ఇంత థ్రిల్‌గా జరి గింది. తర్వాత తను చాలాసార్లు వచ్చేడు. వచ్చిన ప్రతిసారీ కేవలం నేటి కథలూ, వాటి కథకులూ గురించి మాట్లాడే వాడు. అప్పుడప్పుడూ తనవెంట అతను రాసిన కథలూ తీస్కొచ్చేవాడు.

ఇదీ రాజా. నా సీటుతో పనున్న పెద్దమనుషు లంద ర్లోనూ రాజామీదనే నాకు అమితమైన అభిమానం. కారణం ప్రత్యేకించి రాయక్కర్లే దనుకుంటాను.

పోనాటి సాయంత్రం ఏమీ తోచని వేళ అద్దె గదిలో కూర్చున్నాను. సమయానికి రూమ్మేటూ లేడు. చీకటి పడేంత వరకూ తలా తోకా లేని ఆలోచనల్తో కుస్తీ పట్టేను. ఏడింటి క్కాబోలు భగవద్గీత తీసి చదవడం ప్రారంభించేను.. రూము ముందు రిక్షా ఆగిన చప్పుడైతే అటువేపు చూసేను. రాజు వొచ్చేడు.

రాజులో ఒక ప్రత్యేకత ఉంది. అత నెప్పుడూ నవ్వు తూంటాడు. అంత అందమైన మనిషి మరింత అందంగా నవ్వుతే జెలసీలాటి ఆనందం నాకు. అతనిమల్లె నవ్వాలని, నవ్వి, అద్దంలో చూసుకుని ఆ ప్రయత్నాన్ని విరమించిన ఘడియ నాకు బాగా జ్ఞాపకం.

"ఏమిటండి, బాబోయ్! భగవద్గీత చదివేస్తున్నారు" అన్నాడు.

"రండి. రండి. ఏం తోచక బోరుకొట్టి చస్తున్నాను. సమయానికి శ్రీకృష్ణ పరమాత్మలా వొచ్చేరు."

అతను నా ట్రంకుపెట్టెమీద కూర్చుని కాలుమీద కాలు వేసుకుని కళ్లల్లో ఆశ్చర్యాన్ని నింపుకుని మరీ అడిగేడు—

"తోచకపోవడమా ? మీకా ? నన్ను నమ్మమనే ?"

"నమ్మలేరా ?"

"వూహు. చస్తే నమ్మలేను." ఆడపిల్లలా కులుకుతూ అన్నాడు.

"పోనీలేండి". భగవద్గీత అల్మారులో పెట్టి సిగరెట్టు పేకెట్టు విప్పేను. నేనోటి ముట్టించుకుని అతనికో సిగ రెట్టు యివ్వబోయేను.

"వొద్దండి. మాని రెండురోజు లైంది."

ఆశ్చర్యపోయేను.

"మాని రెండురోజులైందా? మీరా ? నన్ను నమ్మమనే?" అతన్ని అనుకరిస్తో అన్నాను.

"నమ్మలేరా ?" న న్నతను బాగా అనుకరించేడు

ఆడపిల్లలా కులుకుతూ 'వూహు .... చస్తే నమ్మలేను' అని అందా మనుకున్నాను గానీ చాతకాదని గ్రహించి వూరు కున్నాను.

"మా నాన్నగారికీ నాకూ మొన్నామధ్య పెద్ద యుద్ధం జరిగింది."

అతనన్న ఆ మాటని తేలిగ్గా తీసుకోడం నా తప్పుకాదు. సిగరెట్లు గురించి యిలాంటి యుద్ధాలు చాలా విన్నాను గనుక నే నది పట్టించుకోలేదు. కానీ ఆ యుద్ధం సిగరెట్ల గురించి కాదని అతనే చెప్పేడు.

"ఈ పెద్దవాళ్ల పట్టుదలలు మరీ అసహ్యంగా ఉంటా యండి. మన మనసులు అర్థంచేసుకోలేరు. వాళ్ల మాట వాళ్లదే గానీ మనమాట వినిపించుకోరు. అవునాండి ?"

"కావచ్చు."

"నాకూ హృదయముంది గనక ప్రేమించేను. వాళ్లు స్థితిపరులు కాకపోవచ్చు. అంతమాత్రంచేత ఆపిల్ల నాకు దూరం కావల్సిందేనా ?"

ఎంతకీ అంతస్తూ, కులం ఈ రెంటినీ ముఖ్య కారణా లుగా తీసుకుని కుమిలిపోయే భగ్నప్రేమికుల అవస్థ రాను రాను బోరుకొట్టేస్తుంది. వెరైటీ కోసరమైనా మరో అంద మైన డిస్‌క్వాలిఫికేషను వినిపించడంలేదు. గనక రాజా చెప్పే ప్రేమాయణం పట్ల ఆసక్తి తగ్గడం తప్పనిసరి. ఇది గవ్వ

నించేడు కాబోలు వాళ్ల వ్యాపారం గురించి మాట్లాడేడు ప్రస్తుతం వాళ్లు కొంచెం కష్టాల్లో ఉన్నార్ట.

లక్షాధికారుల కష్టాలు నాకు తెలీవు. కానీ, అతను చెప్తూన్న వాళ్ల కష్టాలు వింటూంటే నిజాని కవి బలమైన వేనా అని అనుమానం కలిగింది.

దీన్లోనూ నాఆసక్తి ప్రదర్శించకపోడంతో కథల్లోకి సంభాషణ మార్చాడు. ఆ సంభాషణ ఎనిమిదిన్నర వరకూ నిరాటంకంగా సాగింది. రాజుప్రేమాయణంగానీ, వాళ్లనాన్నగారి కష్టాలుగానీ యీ చర్చముందునిలవవు. దీన్లోవున్న రక్తి చెప్పే నంత మాత్రాన అర్థమయ్యేది కాదు. నిమిషాలు, గంటలు రోజులూ గడిచిపోతున్నా 'విషయం' తరగనిది. క్షణక్షణానికీ రంగుమార్చుకుని నిత్యనూతనంగా కనుపించే మహత్తరమైనట్టు వంటిదనీ.

ఆరాత్రి భోజనంచేస్తోన్నా, సినీమాచూస్తోన్నా మా కథలకబుర్లు తగ్గలేదు. మళ్లా రూముకొచ్చి నడుం వంచే మన్నమాటేగానీ కంటికి నిద్దరానూలేదు.

ఆ ఉదయం కొంచెం ఆలస్యంగా నిద్దలేచాము. ఆఫీసుకి వేళవడంమూలంగా గబగబా తయారయ్యాను. ఇద్దరం హోటల్లో కూర్చుని కాఫీ తాగుతున్నవేళ పదిగంటలైంది.

కాఫీముగించి బయటకొచ్చి రిక్షాఎక్కుతూ అతనన్నాడు.

"నాకు వేళవుతుంది. నేనుంటాను. మళ్లా ఎప్పుడైనా కలుసుకుందాంలెండి."

అతనితో కరచలనం చేసేందుకు చేయిముందుకు చాపేను. కరచలనం ముగిసింది. అతనిరిక్షా కదిలింది. నా గుప్పెట్లో ఓకొత్తఅనుభవం భయంకరంగా దాక్కునుంది.

ఈ కథకిదే కథావొస్తువు!.

భయం వేస్తోంది. రోడ్డుమీద నడుస్తోన్నజనం నన్ను తీక్షణంగా చూస్తున్నట్టు అనుమానం కలిగింది. చేతులు వొణుకుతున్నాయి. గుండెల్లో ఓమూల దడగావుంది. భూమి మీద నించునే వోపిక తక్కువవుతోంది.

నేనునమ్మినమనిషి, నన్ను అభిమానించేమనిషి, మనసుకి నచ్చి స్నేహితం నటించి ఇంతద్రోహం తలపెట్టేందుకు అతని ఆత్మక్షోభించ లేదాని ఆ కాసేపట్లో కొన్నివందల తడవు లనుకున్నాను.

రాజానా యింత పనిచేస్త?

గుప్పెటవిప్పడానికి భయంగా వుంది. నా చేతిలో దాక్కున్న దయ్యాన్ని చూడటానికి గట్సులేవు. గుప్పెటని జేబులో దాచేశాను. కళ్లల్లో నీళ్లు తిరుగుతూండగా నెమ్మదిగా ఆఫీసుకొచ్చేను. నా సీట్లో కూర్చుని ఎవరూ చూడకుండా గుప్పెట విప్పేను.

రెండు పచ్చనోట్లు!

వెంటనే గుప్పిట మూసేను. గుండె వేగం మరింత ఎక్కువైంది. మనసు ఆఫీసులోలేదు. రాజు టెరిలిన్ చొక్కా లోపల దాక్కున్న శరీరంలో వో మూలనున్న చిన్న సైజు అతని 'గుండె'ని దేనితో తయారు చేశాడా దేముడని ఆలోచిస్తోంది. మిత్రుడై, నా దగ్గర ఓ స్థానాన్ని సంపాయించుకుని బతికి పోయేడు—ఇప్పుడు నేనేం చేయాలి? ఏం చేయాలి?

సెలవు పెడుతూండగా హెడ్ క్లార్కు అడిగేరు. వంట బాగోలేదని చెప్పేను.

"అంటే మరో కొత్త కథేమైనా రాస్తూన్నారా?"

నవ్వేసి వూరుకున్నాను.

నా వంట్లో బాగోలేదన్నా, నాకీవేళ సెలవు కావాలన్నా, ఆఫీసులో ఎప్పుడైనా పరాకుగావున్నా వాళ్లందరూ భావించేది ఒక్కటే—రావ్ ఏదో కథ రాయబోతూన్నాడు!

ఇంత నమ్మకాన్ని, గౌరవాన్నీ సంపాయించుకున్న నేను ఇప్పుడేం చేయబోతున్నాను. ఏం చేశాను. చేసింది దాచుకుని మామూలు మనిషిలా తిరుగుతే, రేపొద్దున ఈ విషయం పదిమందికీ తెలిసి—భగవంతుడా రాజుని చంపేందుకు ఇంకా ఆలస్యం చేస్తావెందుకు?

రూమ్‌వేపు నడుస్తూన్నాను. రూముని దాటి వెళ్ళిన సంగతి గమనించిన క్షణం వెల్‌కం హోటల్‌ముందు నించున్నాను. లోపలికెళ్ళి కూర్చుని కాఫీకి ఆర్డరిచ్చేను.

జీవితంలో ఇంత డబ్బుని చూడకకాదు నేనింత భయపడత! దీని కెన్నో రెట్లు డబ్బుని చూసేను. ఖర్చు పెట్టేను. జీతం డబ్బు స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకునే అధికారమూ, దర్జాగా తీసుకునే అర్హతా ఉన్నాయి. కథలు రాస్తున్నాను. వాటి ప్రతిఫలాన్ని ఆనందంగా స్వీకరిస్తాను. గర్వంగా ఖర్చు పెట్టుకుంటాను. దేవుడిలాటి నాన్న, కొండలాటి అన్న—ఇద్దరూ నన్ను అమితంగా అభిమానిస్తారు. నోరు తెరుచుకు అడగాలేగానీ రాజూ ఇచ్చిన డబ్బుకి పదిరెట్లు మరుక్షణాన్న నా ముందుంచుతారు.

గుండెల్లో కత్తిదూసినా ఇంత బాధ కలగదేమో! నేను అమితంగా గౌరవించిన ఒకానొక వ్యక్తి చేతుల్లో నా పరువుని వ్యక్తిత్వాన్ని పెట్టి, వెలకట్టి చూడండి. మాస్టారూ! అని ప్రాధేయ పడేంత దౌర్భాగ్యం మళ్లా వచ్చే జన్మకీ వద్దు.

ఆ సాయంత్రంవరకూ భోజనం చేయలేదు. ఆ మాట కొస్తే రూము నుంచి బైటకు రానూలేదు. ఆఫీసు మూసే వేళకి ఆఫీసు కెళ్లేను. ఆఫీసర్ని కలుసుకున్నాను. ఆయన నవ్వుతూ అడిగేరు—

"సెలవు పెట్టారుట"

"అవునండి"

"రెస్టు తీసుకోకుండా మళ్లా ఎందు కొచ్చేరు?"

"మీతో నేను కొంచెం మాట్లాడాలి."

"నిరభ్యంతరంగా మాట్లాడొచ్చు."

"నన్ని సీట్లోంచి మార్చండి."

"ఎందుకనిట?"

ఏమని చెప్పుకోను? నిప్పులాటి మనిషిముందు నా నీక త్వాన్ని విప్పి చెప్పుకున్న తర్వాత క్షమించడమనేమాట అటుంచి, నాచేత ఆ క్షణంలో ఆత్మహత్య జరిగే అవకాశం తప్పకుండా చోటు చేసుకుంటుంది. అందుచేత నిజాన్ని దాచేను.

"సీట్లో పని ఒత్తిడి ఎక్కువైంది" అనేశాను.

"ఇన్నాళ్లూ ఎలా చేయగలిగేరు?"

అవును ఎలా చేయగలిగేను? నిజానికి పని ఒత్తిడనే చిన్న కారణాన్ని భూతద్దంలోంచి చూచి భయపడేంత పిరికివాడిని కానేకాదు. ఈ మనిషి కేమని చెప్పాలి? ఎలా నచ్చచెప్పాలి?

"చూడండి రావ్! మీ నెత్తురు తాగాలని ఇక్కడ ఎవ్వరూ కూర్చోలేదు. మీ పని మీరు చేసుకుపొండి. ఒత్తిడనేది ఇలాటి ఆఫీసుల్లో సర్వ సాధారణమైనది. అందుకని చెప్పి మీలాటి యువకులు భయపడితే జీవితంలో మీరు సాధించే దేముం టుంది. ఆల్‌రైట్! మీ నిజమైన వర్రీస్ ఏమిటో చెప్పేం దుకు అభ్యంతరమైతే దాచుకోండి. మరో నాలుగు రోజులు సెలవుపెట్టి రెస్టు తీసుకోండి. అన్నీ అనుకూలమైనప్పుడే మళ్లా ఆఫీసుకి రండి. హేపీగా ఉండండి రావ్. మీరే దిగులుపడి పోతే ఎల్లా? వెళ్ళిరండి."

ఆయనకేం? ఆయన ఎన్ని నీతులైనా చెప్పగలరు. నా క్కావల్సిన ఓదార్పు ఈ రకమైనదికాదు. నా మనసు నీతి తప్పి కుళ్లిపోతోంది. ఈ మందులు దానికి పని చేయవు.

ఆరాత్రి నిద్రపట్టలేదు. తెల్లవారింది. తెల్లవారు తూనే వో నిర్ణయాని కొచ్చేను. తణుకు ప్రయాణం కట్టేను. అనుకోకుండా బస్సులో వో మిత్రుడు కనుపించేడు. అత నడి గేడు.

"ఎందాకా?"

"తణుకు"

"పని?"

"ప్రత్యేకంగా ఏమీలేదు."

"ఏమైనా సన్మానమా?"

"అలాంటిదే."

"నీకేం గురూ! వెలిగిపోతున్నావ్"

—నామీద అతనికి జెలసీ! ఏంచూసి జెలసీవో? నీతిగా బ్రతుకుతున్నాననా? 'బ్రదర్! నా గురించి ఎత్తు ఆలోచ నలు చేయకు' అని చెప్దామనుకున్నాను. అతను ఏలూర్లో దిగిపోయేప్పుడు గూడా చెప్పనేలేదు.

తణుకులో దిగేను. రాజా వాళ్లింటి గురించి వాకబు చేశాను. వో సోడా షాపతను వో కుర్రాడ్నిచ్చి వాళ్లింటికి పంపేడు.

రాజా వాళ్ల ఇల్లు అతనిలా డాబు సరిగా ఉంది. అతని ఆకారాని కది చక్కటి పోలిక. మే మా ఇంట్లోకి వెడు తూండగా వో నల్లకారు నన్ను దూసుకుపోయింది. అందులో వున్న వో బట్టతలాయన నన్ను చూచి గూడా పట్టించుకో నట్టు చుట్ట కాల్చుకోడంలో నిమగ్నుడై ఉన్నాడు. అతను రాజా వాళ్ల నాన్నగారని షాపు కుర్రాడు చెప్పేడు. తల పంకిం చేను.

షాపు కుర్రాడు ఇంట్లోకివెళ్ళి మరో అయిదు నిమిషాల్లో పద్దెమినిదేళ్ల కుర్రాడితో తిరిగొచ్చేడు. మా ఇద్దర్నీ వరండాలో నించోబెట్టి తన దారిని తను వెళ్లిపోయేడు.

అతను నన్ను పలుకరించలేదు. అతని చేతిలో కాగితం, కలం ఉన్నాయి. రాజా పోలికలు అతన్లో స్పష్టంగా కనుపిస్తు నాయి. బహుశా అతని తమ్ముడై ఉంటాడు. చందమామ లాగానే ఉన్నాడుగానీ మర్యాదా, మన్ననా బొత్తిగా తెలీని రాతి యుగపు మనిషిలా కనిపించేడు. చెట్టంతటివాడిని కాకపోయినా పరాయి మనిషిని, పనిగట్టుకు ఇంతదూరం వచ్చిన వాడిని కనీసం— మీ పేరేమిటి? ఎవరికోసం వచ్చారు?' లని అడ గటంలేదు. పైపెచ్చు ఎవరికో ఉత్తరంరాసే ఘనుడిలా అదే పెద్ద రాచకార్యంలా భావించి 'నీ వెధవ పనేదో చెప్పు, నా కవతల తల మునిగేంత పనుంది' అనే తత్తర చూపులా వాడూను.

అభిమానం దెబ్బతిన్నది. కార్యార్థిని, ఒక గాడిద కాళ్ళు పట్టుకునే నిమిత్తం వచ్చిన అతి సామాన్యుడ్ని. అందుచేత నేనే ముందుగా అన్నాను.

"రాజాకోసం వచ్చేను. అతన్ని చూడాలి."

నా మాట విని గూడా అతను నోరు విప్పలేదు. గబగబా. కాగితంపీద ఏదోరాసి నాకు చూపించేరు. దాన్లో ఇలా ఉంది

'రాజన్నయ్య పది నిమిషాల్లో వస్తాడు. లోపలికొచ్చి కూర్చోండి'

చదివి అతని మొహంలోకి చూసేను. అతను చిన్నగా నవ్వేడు. ఆ నవ్వు నాకు అర్థమైంది. నవ్వు కాదది. నోరులేని మనిషి కళ్ళకు కల్పించే మహత్తర కార్యమైన ఆదరణ! చలించి పోయేను.

అతన్తోపాటు లోపలికెళ్ళి కూర్చున్నాను.

గదిలో కూర్చుంటూ గదినంతా పరిశీలించేను. అది రాజు గదని చెప్పేందుకు రాజు ఫోటోలు నాలుగైదు కనిపించేయి. వో మూల పుస్తకాల షెల్ఫున్నది. మరోపక్క అందమైన రేడియో ఉన్నది.

అతను వాల్యూమ్ తగ్గించి రేడియో ఆన్ చేశాడు. లోపలికెళ్ళి కాఫీతో తిరిగొచ్చేడు. కాఫీ యిచ్చి నా ముందు కూర్చున్నాడు. నేను కాఫీ తాగుతుండగా అత నేదేరాస్తున్నాడు. అతను రాసేది చదవాలన్న తాపత్రయం కలిగింది. కాఫీ ముగించేను. ఈమాటు కొంచెం ఎక్కువగా రాసేడు.

'ఇప్పుడు చెప్పండి. మా రాజన్నయ్య మీకెలా తెలుసు మీదేవూరు? నా పేరు ప్రభు. గ్రహించే ఉంటారు. దేముడ. నా నోరు కట్టేశారు. లేకపోతే మీతో చాలా మాట్లాడేవానినే. ఒక్కోసారి గొంతెత్తి ఏదో పిచ్చిగా పాడేయాలన్నంత కోరిక కలుగుతుంది. వెంటనే ఏడుపొస్తుంది. పోనీలెండి—మీ సంగతులు చెప్పండి. వింటాను.'

అనుభవాని కొచ్చిన దారుణాల్లో ఇదొకటి. అతని ఉత్సాహాన్ని, కోరికనీ, మంచి మనసునీ ఈవిధంగా అన్యాయం చేసిన దేవుడు జాలిలేని రాయనే చెప్తాను. కానీ ఆ ఇంట్లో రాజ్యం చేస్తోన్న అవినీతికీ, దురాలోచనకీ సాక్ష్యంగా ఈ జీవిని సృష్టించి ఉంటాడనేది నిజం.

ప్రభుమీద జాలి కలిగింది. నే నొచ్చిన పని సవివరంగా చెప్దామనుకున్నాను. ఇంత మంచి కుర్రాడికి కథ తెలీకూడదని చెప్పలేదు. నా పేరు చెప్పేను. నా వూరు చెప్పేను. ప్రయాణంలో వో మాటు రాజుని చూచిపోదామని వచ్చినట్టు చెప్పేను.

అంతలో రాజు వచ్చేడు. రాజు రావడంతో ప్రభు వెళ్ళిపోయేడు. రాజు కూర్చుంటూ అన్నాడు.

"ఇంతదూరం మీరు రావాలా? కాకితో ఖబురంపుతే స్వయంగా నేనే వచ్చే వాడినిగా."

"ఎందుకు? మరి రెండు పచ్చ కాగితాలు చేతిలో కుక్కి నా పీక నొక్కేడానికా రాజూ! చాలు. నీ స్నేహం గుణపాఠమైంది. నీ వేషం దగా చేసింది. తీసుకో, ఈ నరకం నేను భరించలేను. నన్ను మంచిగా బ్రతకనివ్వు. ఆమాత్రం మేలు చేయి. చాలు" అన్నాను ఉద్రేకంగా.

ఆ పాపిష్టి డబ్బు టీపాయ్ మీదుంచేను.

అతను సోఫాలో తలవాల్చి చాలా బాధ పడుతున్నట్టు నటించి అన్నాడు.

"నన్ను అర్థం చేసుకోండి. తండ్రి చాటు మనిషిని. వ్యాపార దక్షత ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నవాడిని."

"సెలవ్" అన్నాను నించుని.

అతను చివాలునలేచి నా రెండు చేతులూ పుచ్చుకున్నాడు.

"మీరు వెళ్ళద్దు. ఒక్క క్షణం ఆగండి" అని చెప్పి గబగబా తన పుస్తకాల్లోంచి డైరీతీసి, వో పేజీ తిప్పి నా చేతిలో ఉంచేడు. చదివేను.

'ఇంటి కొచ్చేను. నాన్నతో అన్నాను—ఆయన నా డబ్బునీ, నన్నూ అవమానించేరు. ఆయన్ని పాడు చేయడం నా కిష్టంలేదు. నా డబ్బు నా మొహాన్న కొట్టిన ఆ మంచి మనిషికి చేతులెత్తి నమస్కారం చేశాను. నన్ను మళ్ళా ఆ పాడుపనికి పంపకండి. నేనిక వెళ్ళను—అని.'

అదిరిపోయేను. అతని కళ్ళల్లోకి తిన్నగా చూశాను. అత నేదో చెప్పబోతూండగా ప్రభు రెండు యాపిల్ పళ్ళతో మా గదిలోకి వచ్చేడు.

